
సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా
సోమవారం । 8 । జనవరి । 2024



శాస్త్రోక్తంగా నిత్య కల్యాణం
సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఉదయం నిత్యకల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు.



సిరులతల్లికి నెక్లెస్ బహూకరణ
విశాఖ: కనకమహాలక్ష్మి అమ్మవారికి రూ.1.16లక్షల విలువైన బంగారు నెక్లెస్‌ను తుమ్మడి బ్రదర్స్ అధినేత అందజేశారు. 8లో

ముగ్గురికి కోవిడ్


విశాఖలో ముగ్గురికి కరోనా సోకింది. గడిచిన 24 గంటల్లో 75 మందికి పరీక్షలు చేయగా ముగ్గురికి కరోనా నిర్ధారణ అయింది. 27 మంది హోమ్ ఐసోలేషన్‌లోను, ఇద్దరు ఆస్పత్రుల్లోను ఉండగా.. 36 మంది డిశ్చార్జ్ అయ్యారని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు తెలిపారు.

న్యూస్‌రీల్

అధికారుల నివాస గృహ నిర్మాణాలు వేగవంతం
- పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్ ఆదేశం

పాడేరు : అధికారుల నివాస గృహాల నిర్మాణాలను త్వరితిగతిన పూర్తి చేయాలని ఐటీడీఏ పీవో అభిషేక్ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. పట్టణంలోని ఆర్‌అండ్‌బీ కార్యాలయం ఎదుట నిర్మిస్తున్న అధికారుల నివాస గృహ నిర్మాణాలను ఆదివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నివాస సముదాయానికి అవసరమైన రహదారి, చుట్టూ ప్రహరీ నిర్మాణ పనులను మూడు రోజుల్లో పూర్తి చేయాలని సూచించారు. గృహ సముదాయాల ప్రాంగణంలో వర్షపు నీరు నిల్వ లేకుండా ఉండేలా డ్రైనేజీలు నిర్మించాలని సూచించారు. ఆయన వెంట గిరిజన సంక్షేమ ఈఈ డీవీఆర్ఎం రాజు, డీఈ అనుదీప్, ఏఈ దేముళ్ల పాల్గొన్నారు.

పండగ సంత కళకళ


దుస్తుల షాపుల వద్ద జనాలు

కొయ్యూరు: పండగ సంతకు జనాలు అధికంగా వచ్చారు. ఆదివారం కొయ్యూరులో జరిగిన సంతకు జనాలు నలుమూలల నుంచి తరలి వచ్చారు. దుస్తులు కొనుగోలుకు అధిక ప్రాధాన్యత ఇచ్చారు. కొద్దిసేపు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది.

చాపరాయికి పర్యాటకుల తాకిడి


చాపరాయి జలపాతం వద్ద సందడి చేస్తున్న పర్యాటకులు

డుంబ్రిగుడ: ప్రముఖ పర్యాటక కేంద్రం చాపరాయి జలపాతం పర్యాటకులతో ఆదివారం సందడిగా మారింది. మైదాన ప్రాంతం నుంచి పర్యాటకులు భారీగా తరలివచ్చారు. అంజోడ సిల్క్‌ఫారానికి సందర్శకుల తాకిడి నెలకొంది.

ప్రకృతి అందాలకు ఫిదా


జెండాకొండలో మంచు అందాలను తిలకిస్తున్న పర్యాటకులు

హుకుంపేట: రాష్ట్రంలో అత్యంత ఎతైన శిఖరంగా గుర్తింపు పొందిన ప్రముఖ పర్యాటక ప్రాంతం సీతమ్మపర్వతం (జెండాకొండ)కు ఆదివారం సందర్శకులు భారీగా తరలివచ్చారు. శనివారం సాయంత్రం తీగలవలస పంచాయతీ ఓలుబెడ్డకు చేరుకున్నారు. అక్కడి నుంచి కాలినడకన జెండాకొండకు వెళ్లారు. గుడారాలు ఏర్పాటుచేసుకుని బస చేశారు. వేకువజామున ప్రకృతి అందాలను తిలకించారు. కొండపైన ధింసా రాళ్లు, తేనెపట్టు గుహలను సందర్శించారు.

బొర్రాకు రూ.3.20లక్షల ఆదాయం


బొర్రాగుహలను సందర్శించిన పర్యాటకులు



అనంతగిరి కాఫీ ప్లాంటేషన్ వద్ద వాహనాల రద్దీ

అనంతగిరి: మండలంలోని ప్రముఖ పర్యాటక కేంద్రాలు ఆదివారం పర్యాటకులతో కళకళలాడాయి. బొర్రా గుహలకు పర్యాటకులు పోటెత్తారు. అరకు–విశాఖ ప్రధాన రహదారి అనంతగిరి పరిధిలోగల కాఫీ ప్లాంటేషన్, డముకు వ్యూపాయింట్ సందర్శకులతో సందడిగా మారింది. సుమారు నాలుగు వేల మంది పర్యాటకులు బొర్రాగుహలను సందర్శించగా రూ.3.20 లక్షల ఆదాయం వచ్చిందని బొర్రా గుహల మేనేజర్ గౌరీశంకర్ తెలిపారు.

సూపర్ సేవలు

ఏజెన్సీ చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా రంపచోడవరం ఏరియా ఆస్పత్రిలో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయి. ప్రమాదాల్లో తీవ్రంగా గాయపడే వారిని రాజమహేంద్రవరం రిఫర్ చేయకుండా ఇక్కడ శస్త్రచికిత్సలు చేస్తున్నారు. పూర్తిస్థాయిలో అత్యాధునిక వైద్యం అందించేందుకు గాను మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రిని ప్రభుత్వం నిర్మిస్తోంది.

- రంపచోడవరం ఏరియా ఆస్పత్రిలో అత్యాధునిక వైద్యం
- రూ.49.26 కోట్లతో మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణం
- పూర్తిస్థాయిలో వైద్య నిపుణులు
- అందుబాటులోకి రానున్న ప్రసూతి, శిశు ఆరోగ్య విభాగం
- ప్రత్యేక దృష్టి సారించిన రాష్ట్ర ప్రభుత్వం



రంపచోడవరం ఏరియా ఆస్పత్రి ఓపీ క్యూలో రోగులు

రంపచోడవరం: పూర్తిస్థాయిలో వైద్యసేవలు అందుబాటులో లేక పరిసర ప్రాంతాల ప్రజలు నానా ఇబ్బందులు పడేవారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిపక్షనేతగా మారేడుమిల్లి మండలం చాపరాయి వచ్చినప్పుడు వారి సమస్యలు తెలుసుకున్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే పూర్తిస్థాయిలో వైద్యసేవలు కల్పిస్తామని హామీ ఇచ్చారు.



రంపచోడవరం ఏరియా ఆస్పత్రి



ఏరియా ఆస్పత్రిలో నిర్మాణం పూర్తి అయిన మాతా శిశు ఆరోగ్య విభాగ భవనం

ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన వెంటనే ఆయన ఆదేశాల మేరకు జిల్లా అధికార యంత్రాంగం రంపచోడవరం ఏరియా ఆస్పత్రిపై దృష్టి సారించింది. పూర్తిస్థాయిలో సేవలను అందుబాటులోకి తెచ్చారు.

ప్రతీరోజు 400 మందికి..

రంపచోడవరం ఏరియా ఆస్పత్రిలో ప్రతిరోజూ సుమారు 400 మంది రోగులు వైద్యసేవలు పొందుతున్నారు. సుమారు 150 మంది వరకు రోగులు ఇన్‌పేషెంట్లుగా వైద్యం పొందుతున్నారు. గత ఐదు నెలల్లో సుమారు 500 మేజర్ సర్జరీలు జరిగాయి. ఏప్రిల్ నుంచి డిసెంబర్ వరకు సుమారు లక్ష మందికి వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించారు. ప్రస్తుతం ఆస్పత్రిలో 16 మంది వైద్యులు అందుబాటులో ఉన్నారు. వీరిలో ఆరుగురు ప్రత్యేక వైద్య నిపుణులు ఉన్నారు. ఆస్పత్రి సూపరిటెండెంట్ గైనకాలజిస్టు కావడంతో మెరుగైన ప్రసూతి సేవలు అందిస్తున్నారు.

ఏడాదిలో లక్షకు పైగా..

ఏరియా ఆస్పత్రిలో ఏడాది కాలంలో ఓపీలో 1,13,570 మందికి, ఇన్‌పేషెంట్లుగా 12,978 మందికి వైద్యులు సేవలందించారు.అలాగే 2502 మందికి శస్త్రచికిత్సలు, 692 మందికి ప్రసవాలు, 1,27,968 మందికి రక్త పరీక్షలు,3112 మందికి అల్ట్రాసౌండ్ స్కానింగ్, 7074 మందికి ఎక్స్‌రేలు, 1476 ఈసీజీ, 2930 క్షయవ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించినట్టు వారు పేర్కొన్నారు.

రిఫర్ చేసే పరిస్థితి తప్పింది

ప్రమాదాల్లో తీవ్రంగా గాయపడే వారికి పూర్తిస్థాయిలో వైద్యసేవలు అందించే సదుపాయాలు గతంలో లేవు. దీంతో అటువంటి కేసులను రాజమహేంద్రవరం రిఫర్ చేసేవారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అధునాతన వైద్య సేవలు అందుబాటులోకి వచ్చాయి.

చురుగ్గా నిర్మాణ పనులు

రంపచోడవరం ఏరియా ఆస్పత్రి అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రూ. 49.26 కోట్లతో మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రిని మంజూరు చేశారు. ప్రస్తుతం భవన నిర్మాణ పనులు చురుగ్గా జరుగుతున్నాయి. కొద్ది నెలల్లో నిర్మాణ పనులు పూర్తి కానున్నాయి. ఈ ఆస్పత్రి ప్రారంభమైతే సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు గిరిజనులకు అందుబాటులోకి వస్తాయి. గిరిజనులకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు స్థానిక ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి తన వంతు కృషి చేస్తున్నారు.

అందుబాటులో వైద్య పరీక్షలు
- బయో ఎనలైజర్‌తో గంటకు 640 టెస్టులు నిర్వహించే యంత్ర సామర్థ్యం ఇక్కడ అందుబాటులో ఉంది. రక్తానికి సంబంధించి అన్ని రకాల పరీక్షలు జరుగుతున్నాయి.
- స్థానిక ఏరియా ఆస్పత్రి ప్రాంగణంలో రూ. 12.60 కోట్ల వ్యయంతో చేపట్టిన మాతా శిశు ఆరోగ్య విభాగ భవన నిర్మాణం పూర్తయింది. త్వరలో ఈ భవనం అందుబాటులోకి రానుంది. తల్లీబిడ్డలకు అన్ని రకాల వైద్యసేవలు అందుబాటులో ఉంటాయి.



బయో ఎన్‌లైజర్ యంత్ర పరికరం

బాగా చూసుకుంటున్నారు


ప్రసవానికి ఐదు రోజులు ముందే రంపచోడవరం ఏరియా ఆస్పత్రిలోని మాతా శిశు సంరక్షణ కేంద్రానికి వచ్చాను. ఇక్కడ ప్రతీ రోజు పౌష్టికాహారం ఇస్తున్నారు. అలాగే వైద్య పరీక్షలు చేస్తున్నారు. అన్నిరకాలుగా బాగా చూసుకుంటున్నారు.

– కె దివ్యభారతి, సోకులగూడెం, రంపచోడవరం మండలం

అవస్థలు తప్పాయి


రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఏరియా ఆస్పత్రిలో చేరాను. కాలు విరిగిపోవడంతో ఇక్కడ శస్త్ర చికిత్స చేశారు. లేదంటే రాజమహేంద్రవరం వెళ్లాల్సి వచ్చేది. పూర్తిస్థాయిలో సేవలు అందుబాటులో ఉన్నాయి. దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవస్థలు తప్పాయి.

– కె నాగేశ్వరరావు, బీరంపాలెం, అడ్డతీగల మండలం

అత్యవసర వైద్యం అందిస్తున్నాం


ఏరియా ఆస్పత్రిలో అన్ని రకాల వైద్య సేవలు అందించేందుకు పూర్తిస్థాయిలో వసతులు ఉన్నాయి. అత్యవసర వైద్యం కూడా అందిస్తున్నాం. రాజమహేంద్రవరం, కాకినాడ రిఫర్ కేసులు సంఖ్య బాగా తగ్గించాం. మెరుగైన ప్రసూతి సేవలను అందిస్తున్నాం.

– డా.కె లక్ష్మి, ఆస్పత్రి సూపరింటెండెంట్, రంపచోడవరం ఏరియా ఆస్పత్రి

ఎల్లవరం పరిసరాల్లో చిరుత సంచారం
- పెంపుడు కుక్కపై దాడి



చిరుత దాడిలో గాయపడి మృతి చెందిన కుక్క

అడ్డతీగల: మండలంలోని ఎల్లవరం పరిసరాల్లో చిరుత సంచరిస్తున్నట్టుగా అటవీశాఖ అధికారులు నిర్ధారించారు. ఆదివారం ఇదే ప్రాంతానికి చెందిన చేపల చెరువుల సమీపంలో పెంపుడు కుక్కపై దాడి చేయడంతో తీవ్రంగా గాయపడి మృతి చెందింది. అదే సమయంలో పెద్దగా అరుస్తూ కర్రలతో అక్కడికి వెళ్లేసరికి చిరుత సమీప అటవీ ప్రాంతంలోకి వెళ్లిపోయిందని అటవీశాఖ అధికారులకు స్థానికులు సమాచారమిచ్చారు. దీంతో అడ్డతీగల అటవీ రేంజి అధికారి షేక్ షెహన్నా ఇతర సిబ్బంది చిరుత దాడి చేసిన ప్రాంతాన్ని సందర్శించారు. అక్కడి పాదముద్రలను చిరుతకు చెందినవిగా నిర్ధారించారు. ఎల్లవరం పరిసర ప్రాంతాల్లో చిరుత సంచరిస్తున్నందున ప్రజలు ఒంటరిగా తిరగొద్దని రేంజి అధికారి సూచించారు. రాత్రివేళల్లో రాకపోకలు సాగించవద్దని, ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని ఆయన కోరారు.

విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ


ట్యాబ్‌లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంతబాబు

అడ్డతీగల: విద్యార్థుల్లో సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించేందుకు డిజిటల్ విద్యను ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి,ఎమ్మెల్సీ అనంత బాబు అన్నారు. ఎనిమిదో తరగతి విద్యార్థులకు ప్రభుత్వం సమకూర్చిన ల్యాప్‌టాబ్‌లను ఆదివారం వారు మండలంలోని ఎల్లవరం జెడ్పీ ఉన్నత పాఠశాలలో అందజేశారు. విద్యార్థులు ఇప్పటినుంచి ఆధునిక విద్యావిధానం పట్ల సంపూర్ణ అవగాహన పొందాలని సూచించారు. 163 మంది విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేశారు. ఎంపీపీ బొడ్డపాటి రాఘవ, జెడ్పీటీసీ మద్దాల వీర్రాజు, ఎంఈవో శ్రీనివాసరావు, పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సుల్లో సురక్షిత ప్రయాణం
- ఏలేశ్వరం ఆర్టీసీ డిపో ట్రాఫిక్ ఇన్‌చార్జి నారాయణ
- లక్కీ డిప్ విజేతలకు బహుమతుల పంపిణీ



లక్కీడిప్ విజేత లబ్బర్తి సర్పంచ్ సత్యవతికి బహుమతి అందజేస్తున్న ఆర్టీసీ అధికారులు

రాజవొమ్మంగి: ఆర్టీసీ బస్సుల్లో మాత్రమే సురక్షిత ప్రయాణం సాధ్యమని ఏలేశ్వరం ఆర్టీసీ డిపో ట్రాఫిక్ ఇన్‌చార్జి వీఎస్‌వీఎన్ నారాయణ తెలిపారు. ఆదివారం ఆయన డిసెంబర్ నెల లక్కీ డిప్ విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం సుఖవంతంగా సాగుతుందన్నారు.

సురక్షితంగా గమ్యానికి చేరవచ్చన్నారు. ప్రయాణికులను ప్రోత్సహించేందుకు ఆర్టీసీ ప్రతి నెలా లక్కీడిప్ నిర్వహిస్తోందన్నారు. ఈ రూట్‌లో వెళ్లే ప్రయాణికులు గమ్యం చేరిన తరువాత టిక్కెట్లపై తమ ఫోన్ నెంబర్ వేసి బస్సులో గల బాక్సులో వేయాలని సూచించారు. లక్కీ డిప్ విజేతలు లబ్బర్తి సర్పంచ్ సత్యవతి, తదితరులకు బహుమతులు అందజేశారు.

మారథాన్ పోటీల్లో సచివాలయ ఉద్యోగి ప్రతిభ
- కాంస్య పతకం సాధించిన కొర్రా గోపి



మారథాన్ పోటీల్లో తృతీయ స్థానంలో నిలిచిన కొర్రా గోపి (ఎడమవైపు)

అనంతగిరి: కాకినాడ జిల్లా ఉప్పాడలోజరిగిన అల్ వర్ ఇండియా 21 కిలోమీటర్ల మారథన్ పోటీల్లో సచివాలయ ఉద్యోగి కొర్రా గోపి ప్రతిభ కనబరిచాడు. రొంపల్లి సచివాలయం వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న అతను తృతీయ స్థానంలో నిలిచి కాంస్య పతకం సాధించాడు. కాకినాడ సీపోర్టు సిల్వర్ జూబ్లీ ఆధ్వర్యంలో ఈ పోటీలు జరిగాయి. అతనిని మండలంలోని అధికారులు, ప్రజాప్రతినిధులు అభినందించారు.

ఏకలవ్యకు సంక్రాంతి శోభ


పి.ఎర్రగొండ ఏకలవ్య పాఠశాలలో సంక్రాంతి సంబరాల్లో నిర్వహించిన ముగ్గుల పోటీ



విద్యార్థినుల నృత్య ప్రదర్శనలు

- పి.యర్రగొండలో విద్యార్థినుల సందడి
- ఆకట్టుకున్న ముగ్గులు, నృత్య పోటీలు

వై.రామవరం: మండలంలోని పి.యర్రగొండ ఏపీ ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలో సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ రామకృష్ణ విద్యార్థినులకు సంక్రాంతి విశిష్టతను తెలియజేశారు. విద్యార్థినులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. పిండి వంటలు, స్వీట్లు తయారు చేస్తూ సందడి చేశారు. గిరిజన సంప్రదాయ నృత్యాలతో విద్యార్థులు అలరించారు. ఈకార్యక్రమంలో పలు పాఠశాలల పీడీలు న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. విజేతలకు బహుమతులు అందజేశారు.

బుద్ధుడు జీవితంపై కాపారపు పరిశోధనలు
నక్కపల్లి: చందనాడ గ్రామానికి చెందిన డిగ్రీ అధ్యాపకుడు కాపారాపు నాగేశ్వరరావు బుద్ధుడి జీవితంపై పరిశోధనలు నిర్వహించారు. ఈ నెల 6, 7 తేదీల్లో విశాఖ బుల్లయ్య కళాశాలలో నిర్వహించిన హిస్టరీ కాంగ్రెస్‌లో ఈ పరిశోధనల గురించి వివరించారు. బుద్ధుడి జీవిత చరిత్రతో పాటు, అమరావతి, నాగార్జున కొండ, బొజ్జన్నకొండ బౌద్ధారామాల గురించి చేసిన పరిశోధనలను ఈ హిస్టరీ కాంగ్రెస్‌లో వివరించి నివేదిక సమర్పించినట్టు నాగేశ్వరరావు తెలిపారు. ఈ పరిశోధనల నివేదికపై నిర్వాహకులు నాగేశ్వరరావుకు ప్రశంసాపత్రాన్ని అందజేశారు. నాగేశ్వరరావు చింతపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డిగ్రీ అధ్యాపకుడిగా పనిచేస్తున్నారు.

‘ఐటీడీఏ’కు కొత్త సొబగులు
- కార్పొరేట్ కార్యాలయాన్ని తలపించేలా ఆధునికీకరణ
- భవనాన్ని ప్రారంభించిన పీవో అభిషేక్



డిజిటల్ బోర్డుతో పాడేరు ఐటీడీఏ కార్యాలయం



ఐటీడీఏ ప్రాంగణంలో బిర్సాముండా విగ్రహం



ఆకర్షణీయంగా ఐటీడీఏ పరిపాలన భవనం



పాడేరు ఐటీడీఏ కార్యాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న పీవో అభిషేక్

పాడేరు : స్థానిక ఐటీడీఏ ప్రధాన కార్యాలయ భవనం, ప్రాంగణాన్ని ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. నెలరోజులుగా చేపట్టిన పనులు పూర్తికావడంతో ఆదివారం ఐటీడీఏ పీవో అభిషేక్ ప్రారంభించారు. ప్రాజెక్టు అధికారి ఛాంబర్, ఐటీడీఏ సమావేశ మందిరం, కారు పార్కింగ్, కార్యాలయ ప్రాంగణంలో ప్రత్యేకంగా విద్యుత్ దీపాలను ఏర్పాటుచేశారు. కార్పొరేట్ కార్యాలయాన్ని తలపించేలా తీర్చిదిద్దారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ కార్యాలయం బయట ఐటీడీఏ ఉద్యోగుల కోసం ప్రత్యేక పార్కింగ్ కేటాయించామన్నారు. ఒకేసారి 25 కార్లతో పాటు ద్విచక్ర వాహనాలు కూడా పార్కింగ్ చేసుకోవచ్చన్నారు. స్వాతంత్ర్య దినోత్సవం, గణతంత్ర దినోత్సవాల్లో జాతీయ జెండాను ఎగరవేసేందుకు ప్రత్యేకంగా జెండా దిమ్మను నిర్మించామన్నారు. తక్కువ సమయంలో ఐటీడీఏను ఆధునీకరించిన గిరిజన సంక్షేమ శాఖ అధికారులను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ ఏపీవో ఎం. వెంకటేశ్వరరావు, ఉద్యానవన ప్రాజెక్టు అధికారి ఎన్. అశోక్, ఏఏవో శ్రీనివాస్‌కుమార్, పద్మాపురం గార్డెన్ మేనేజర్ బొంజుబాబు, ఐటీడీఏ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

చూసొద్దాం.. శీతాకాలం!


జోలాపుట్టు జలాశయం వద్ద ఆకట్టుకుంటున్న మంచు సోయగం



మంచు తెరలు కమ్మేసిన ఘాట్‌రోడ్డులో ప్రయాణం



పాడేరులో చలి మంట కాగుతున్న స్థానికులు

పాడేరు, చింతపల్లి, ముంచంగిపుట్టు, జోలాపుట్టు ప్రాంతాల్లో మంచు అందాలు కట్టి పడేస్తున్నాయి. ఉష్ణోగ్రతలు పడిపోతుండటంతో చలిగాలులు విజృంభిస్తున్నాయి. శీతల వాతావరణాన్ని ఎంజాయ్ చేసేందుకు పర్యాటకులు పోటెత్తుతున్నారు. చలిమంటలను కాగుతూ ఆస్వాదిస్తున్నారు. – సాక్షి,పాడేరు, ముంచంగిపుట్టు

ఆసరా లేని పేదలకు అండగా జగనన్న


తిమ్మాపురంలో పింఛన్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంతబాబు


సభకు హాజరైన ప్రజలు


ఇందుకూరుపేటలో లబ్ధిదారులకు పింఛన్ అందజేస్తున్న ఎమ్మెల్యే ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంతబాబు

అడ్డతీగల: ఆసరా లేని నిరుపేదలకు కొండంత అండగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు అందిస్తున్నారని రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంతబాబు అన్నారు. మండలంలోని తిమ్మాపురంలో వైఎస్సార్ పెన్షన్ కానుక నగదు పంపిణీ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా అడ్డతీగల మండలానికి సంబంధించి 5,616 మందితో పాటు కొత్తగా మంజూరైన 60 మందికి పెరిగిన పెన్షన్ నగదును అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంతబాబు మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి నిబద్ధతతో కృషి చేస్తున్న ముఖ్యమంత్రి ఒక్క వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనన్నారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో అడ్డతీగల మండలానికి పెన్షన్‌ల రూపేణా రూ.26 కోట్లు అందజేస్తే ఈ నాలుగున్నరేళ్లలో జగనన్న ప్రభుత్వం రూ.76 కోట్లు పంపిణీ చేసిందన్నారు.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వివిధ సంక్షేమ పథకాల రూపేణా అడ్డతీగల మండలానికి రూ.176 కోట్లు అందజేసిందన్నారు. గిరిజనుల ఏళ్ల తరబడి సాగు చేసుకుంటున్న కొండపోడు భూములకు పట్టాలు ఇవ్వడం చరిత్రాత్మకమన్నారు. మారుమూల పల్లెలకు పక్కా రోడ్లు మంజూరు చేసిందన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి విద్యార్థులను చదువుల్లో ప్రోత్సహించడానికి అనేక పథకాలు అమల్లోనికి తెచ్చారన్నారు. మహిళల ఆర్థికాభివృద్ధికి ఎన్నో పథకాలు అందిస్తున్నారన్నారు. చంద్రబాబు హయాంలో ప్రజా సంక్షేమాన్ని గాలికొదిలేసి మరుగుదొడ్ల నిర్మాణాల్లో సైతం నిధులను నేతలు దిగమింగినా విస్మరించి, కోట్లాది రూపాయల ప్రజాధనాన్ని స్వాహా చేశారన్నారు. ప్రజల బాగోగులు చూసుకోవడంలో చిత్తశుద్ధితో వ్యవహరిస్తున్న జగన్‌మోహన్‌రెడ్డిని మరలా ముఖ్యమంత్రిని చేసుకోవడానికి ప్రతి ఒక్కరూ చేయి చేయి కలిపి ఐక్యంగా ముందుకు కదలాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర రోడ్ డవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ బత్తుల సత్యనారాయణ, ఎంపీపీ బొడ్డపాటి రాఘవ, జెడ్పీటీసీ మద్దాల వీర్రాజు, సొసైటీ చైర్‌పర్సన్ తోట రాజేశ్వరరావు, మండల జేసీఎస్ కన్వీనర్ నక్కా మోహన్, ఎంపీడీవో కె.బాపన్నదొర తదితరులు పాల్గొన్నారు.

ఇచ్చిన మాటకు కట్టుబడే వ్యక్తి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి

దేవీపట్నం : మండలంలోని ఇందుకూరుపేట జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఆదివారం జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంతబాబు మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన మాటకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి కట్టుబడి అవ్వా, తాతల పింఛన్‌ను రూ. 3 వేల రూపాయలకు పెంచడం చరిత్రాత్మకమన్నారు. టీడీపీ పాలనలో కేవలం ఆ పార్టీల నాయకులు మాత్రమే లబ్ధిచేకూరేదన్నారు. కానీ నేడు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలను అందజేస్తోందన్నారు. మండలంలో సీఎం జగనన్న ఐదేళ్లలో రూ.130 కోట్లు లబ్ధిదారుల ఖాతాలో నేరుగా జమ చేసిందన్నారు.అనంతరం పాఠశాల విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కుంజం మురళి, జెడ్పీటీసీ సిరసం సత్యవేణి, తహశీల్దార్ సత్యనారాయణ, ఎంపీడీఓ రత్నకుమారి, నాయకులు బాబ్జి, సత్యనారాయణ, మురళి సర్పంచ్, లి ఎంపీటీసీ లు గృహసారథులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సాక్షి స్పెల్ బీకు విశేష స్పందన

- విశాఖలో రీజనల్ స్థాయి పరీక్ష
- అధిక సంఖ్యలో పాల్గొన్న విద్యార్థులు

SAKSHI SPELL Bee 2023-24


స్పెల్ పరీక్ష రాస్తున్న విద్యార్థులు

విశాఖ విద్య : 'సాక్షి' మీడియా ఆధ్వర్యంలో నిర్వహించిన స్పెల్ బీ పరీక్షకు విశేష స్పందన లభించింది. ఆదివారం నగరంలోని అక్కయ్యపాలెంలో గల జ్ఞాననికేతన్ పాఠశాలలో జరిగిన పరీక్షకు ప్రభుత్వ, ప్రైవేటు స్కూళ్ల నుంచి విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. 1 నుంచి 10వ తరగతి వరకు విద్యార్థులను నాలుగు కేటగిరీలుగా విభజించి స్పెల్ బీ పరీక్ష నిర్వహించారు. పాఠశాల, జిల్లా స్థాయిలో ఇప్పటికే జరిగిన పరీక్షలో ప్రతిభ చాటిన విదార్థులు రీజినల్ స్థాయి పరీక్షలో పాల్గొన్నారు. వీటిలో సత్తా చాటిన విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో జరిగే పరీక్షకు హాజరుకానున్నారు. రవీంద్ర భారతి, శ్రీ చైతన్య, చలపతి, రవీస్ లిటిల్ ఛాంప్, గ్రీన్ సిటీ, శ్రీ విశ్వ, విశాఖ, నారాయణ దొర, వి.టి.స్కూల్, రామకృష్ణ తదితర పాఠశాలల నుంచి విద్యార్థుల పరీక్షకు హాజరయ్యారు. పోటీతత్వాన్ని పెంపొందించేలా నిర్వహిస్తున్న పరీక్ష కావటంతో విద్యార్థులు తల్లిదండ్రులు సైతం ఎంతో ఆసక్తి కనబరిచి, వారే స్వయంగా తమపిల్లలను పరీక్ష కేంద్రానికి తీసుకొచ్చారు. పరీక్ష కేంద్రంలో విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం లేకుండా సాక్షి మీడియా ఆధ్వర్యంలో తగిన ఏర్పాట్లు చేశారు. ప్రజెంటింగ్ స్పాన్సర్‌గా డ్యూక్స్ వ్యాపి, అసోసియేట్ స్పాన్సర్ గా ట్రిప్స్ ఇంటర్నేషనల్ స్కూల్ వ్యవహరించాయి. విశాఖతో పాటు విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల నుంచి కూడా విద్యార్థులు హాజరయ్యారు. పరీక్ష కేంద్రంలో తాగునీరు, ఇతర సౌకర్యాలను కల్పించారు. జ్ఞాననికేతన్ ఎయిడెడ్ స్కూల్ కరస్పాండెంట్ సునీత పరీక్షలను పర్యవేక్షించి, తగిన సహకారం అందించారు.

పిల్లలకు ఎంతో ఉపయోగం


మా అమ్మాయి లాస్య 8వ తరగతి చదువుతుంది. సాక్షి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్పెల్ బీ పరీక్ష రాస్తానని చెబితే ప్రోత్సహించాం. ఇంగ్లిష్‌పై పట్టు సాధించేందుకు ఇలాంటి పరీక్షలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయి.

– కట్టా సునీత, విద్యార్థి తల్లి, విశాఖపట్నం

పోటీతత్వం పెరుగుతుంది


మా పెదబాబు 8, చిన్నోడు 5వ తరగతి చదువుతున్నాడు. ఇద్దరినీ కూడా సాక్షి మీడియా గ్రూప్ వారు నిర్వహించే స్పెల్ బీ పరీక్ష రాయిస్తున్నాను. పెదబాబు గతంలో కూడా రాష్ట్ర స్థాయి వరకు వెళ్లాడు. ఇలాంటి పరీక్షల వల్ల పిల్లల్లో పోటీ తత్వం పెరుగుతుంది.

– మజ్జి సుజాత, విద్యార్థి తల్లి, గాజువాక

పోటీ పరీక్షలంటే ఇష్టం


పోటీ పరీక్షలు రాయటం అంటే ఎంతో ఇష్టం. సాక్షి స్పెల్ బీ పరీక్ష ఇప్పటికే రెండు సార్లు రాశాను. ఫైనల్‌కు వరకు వెళ్లాలనే లక్ష్యంతో బాగా ప్రిపేర్ అయ్యాను. స్పెల్ బీ పరీక్ష రాసేందుకు మా టీచర్లు ప్రోత్సహించారు. అమ్మనాన్న ఇక్కడి వరకు తీసుకొచ్చారు.

– వి.భాను చక్రధర్, 5వ తరగతి, విజయనగరం

ఇంగ్లిష్ నేర్చుకోవచ్చు


స్పెల్ బీ పరీక్ష ఫైనల్‌కు వెళ్లాలని మా టీచర్లు అన్ని నేర్పించారు. దీని వల్ల ఇంగ్లిష్ బాగా నేర్చుకోవచ్చు. మా స్కూల్లో పెట్టే పరీక్షల్లో నేను పాల్గొంటాను. అమ్మ నాన్న బాగా ప్రోత్సహించారు. సాక్షి వారు ఇచ్చిన పుస్తకంతో పరీక్షకు సిద్ధమయ్యాను.

– మళ్ల చైత్ర గీతిక, 6వ,తరగతి, శ్రీకాకుళం

ఫైనల్‌కు వెళ్తాను


స్పెల్ బీ పరీక్షలపై మా స్కూల్లో టీచర్లు బాగా నేర్పించారు. జిల్లా స్థాయిలో నిర్వహించిన పరీక్షలో విజయం సాధించాను. ఈసారి స్పెల్ బీ పరీక్ష బాగా రాశాను. ఫైనల్‌కు వెళ్తాననే నమ్మకం ఉంది.

– నీలపు ఇతియా, 6వ తరగతి, గాజువాక

శభాష్.. బాల

ఔరా అనిపించిన గుడిలోవ విద్యార్థుల విన్యాసాలు


కార్యక్రమంలో మాట్లాడుతున్న జడ్జి సాయి కళ్యాణ చక్రవర్తి


మల్లకంబపై విద్యార్థుల విన్యాసాలు


ట్యూబ్‌లైట్లు పగలుగొడుతూ దూకుతున్న విద్యార్థి


ట్యూబ్‌లైట్లను పగలుగొడుతూ మోటార్ బైక్‌తో జంప్ చేస్తున్న విద్యార్థులు

ఆనందపురం : మండలంలోని గుడిలోవలో ఉన్న విజ్ఞాన్ విహార్ ఆవాస విద్యాలయం వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం విద్యార్థులు సాహసోపేతంగా చేసిన శారీరక ప్రదర్శనలు, విన్యాసాలు గగుర్పాటు కలిగించాయి. ఆహుతులను సంభ్రమాశ్చర్యాలకు గురి చేశాయి. విద్యార్థులు చేసిన విన్యాసాలు వారి ధైర్య సాహసాలకు ప్రతీకగా నిలిశాయి. అందరి చేత ఔరా అనిపించాయి. బాలికలు మోటార్ సైకిళ్లపై చేసిన విన్యాసాలు శభాష్ అనిపించాయి. మండుతున్న అగ్నిగోళం నుంచి విద్యార్థి దూకడం, నడుస్తున్న మోటార్ సైకిల్‌పై విద్యార్థులు చేసిన యోగాసనాలు, శారీరక విన్యాసాల ప్రదర్శన విశేషంగా ఆకట్టుకుంది. 30 అడుగులు ఎత్తు నుంచి పదో తరగతి విద్యార్థులు మోటార్ సైకిల్‌తో జంప్ చేస్తూ ట్యూబ్‌లైట్లను పగలుగొడుతూ చేసిన విన్యాసం, మండుతున్న అగ్నిగోళం నుంచి మోటార్ బైక్‌తో దూకడం, వంద అడుగులు ఎత్తున గల రోప్‌పై గాలిలో చేసిన యోగాసనాలు, మల్లకంబపై చేసిన విన్యాసాలు, అందరినీ కట్టిపడేశాయి. తప్పెట గుళ్లు, పులివేషాలు, పిరిమిడ్స్, సామూహిక డ్రిల్ వంటి వాటిని విద్యార్థులు ఎంతో సమన్వయంతో ప్రదర్శించి అందరినీ ఆకట్టుకున్నారు. దేశానికి ఉపయోగపడే విద్యావిధానం అవసరం దేశానికి ఉపయోగపడే విధంగా విద్యా విధానాలను అమలు పరచాలని విజయనగరం జిల్లా ప్రిన్సిపాల్ డిస్ట్రిక్ట్ సెషన్స జడ్జి బి.సాయి కళ్యాణ చక్రవర్తి చెప్పారు. గుడిలోవ విజ్ఞాన్ విహార్ ఆవాస విద్యాలయం వార్షికోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. విద్య కేవలం ఉపాధి కోసమే కాదని.. దాని ద్వారా దేశ ప్రజలకు ఉపయోగపడే పనులు చేపట్టాలని పిలుపునిచ్చారు. మైనస్ డిగ్రీలో దేశ భద్రత కోసం నిరంతరం శ్రమిస్తున్న సైనికులను స్ఫూర్తిగా తీసుకోవాలని చెప్పారు. ఈ సందర్భంగా ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను పాఠశాల తరఫున సత్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి వై.వి.అనురాధ, స్టీల్ ప్లాంట్ చీఫ్ విజిలెన్స్ అధికారి ఎస్.కరుణరాజు, విద్యాభారతి అఖిల భారత ప్రధాన కార్యదర్శి అవనీశ్ భట్నాగర్, విజ్ఞాన్ విహార్ కమిటీ అధ్యక్షుడు పి.వి.నారాయణ రావు, డైరెక్టర్ దూసి రామకృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

సిరులతల్లికి నెక్లెస్ బహూకరణ

దాబాగార్డెన్స్ : విశాఖ వాసుల ఆరాధ్యదైవం కనక మహాలక్ష్మికి రూ.లక్షా 16 వేల 750 విలువ చేసే 16 గ్రాముల 525 మిల్లీ గ్రాముల బంగారు నెక్లెస్‌ను ఆలయ ఈవో శిరీషకు తుమ్మిడి బ్రదర్స్ అధినేత తుమ్మిడి రామ్‌కుమార్, ప్రతినిధి శ్రీనివాస్ అందజేశారు. ఆలయ సంప్రదాయం ప్రకారం వారిచే అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపించారు. వేద ఆశీర్వచనం అనంతరం అమ్మవారి ప్రసాదం అందజేశారు. తుమ్మిడి బ్రదర్స్ 15వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని నెక్లెస్ అందించినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ సహాయ కార్యనిర్వహణాధికారి కె తిరుమలేశ్వరరావు, తుమ్మిడి బ్రదర్స్ ప్రతినిధి బాబీ, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

వైజాగ్.. భలే హుషారు


స్టెప్పులేస్తున్న వెంకటేష్, శ్రద్ధా శ్రీనాథ్

బీచ్‌రోడ్డు : వైజాగ్ వస్తే చాలా హుషారుగా ఉంటుందని హీరో వెంకటేష్ అన్నారు. సైంధవ్ చిత్రం ప్రీ రిలీజ్ వేడుకలను ఆదివారం బీచ్‌రోడ్డులో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన మొదటి సినిమా నుంచి వైజాగ్ ప్రేక్షకులు తనను ఆదరిస్తూ వస్తున్నారన్నారు. చాలా సినిమాలు వైజాగ్‌లో షూటింగ్ చేశామన్నారు. తన 75వ సినిమా సైంధవ్ ప్రేక్షకులకు నచ్చుతుందన్నారు. ఈ సందర్భంగా సినిమాలోని డైలాగ్స్ చెప్పి అభిమానులను అలరించారు. సైంధవ్ సినిమాకు హీరో సారా పాప అని చెప్పారు. డైరెక్టర్ శైలేష్ కొలను మాట్లాడుతూ తనకు వైజాగ్ బాగా కలిసి వచ్చిందన్నారు. సైంధవ్ సినిమాను స్టీల్‌ప్లాంట్ కాలనీలో 40 రోజులు షూటింగ్ చేశామన్నారు. హిట్, హిట్–2 సినిమాలు ఇక్కడ షూటింగ్ చేసి మంచి విజయం సాధించామని, ఇప్పుడు ఈ సినిమాతో విజయం సాధిస్తుందని నమ్మకం ఉందన్నారు. వెంకీమామను ప్రేక్షకులను ఎలా చూడాలని అనుకుంటున్నారో అలాగే ఈ సినిమాలో చూపించామన్నారు. వెంకీమామ 75 సినిమా తనకు ఇవ్వటం చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో హీరోయిన్ శ్రద్ధా శ్రీనాథ్, నటీనటులు పాల్గొన్నారు.

మెగాస్టార్ ఫ్యాన్ చిత్రం ఆడియో విడుదల


ఆడియో ఫంక్షన్‌లో చిత్రం యూనిట్

బీచ్‌రోడ్డు: జల్లు ప్రొడక్షన్ బ్యానర్స్ కిరణ్ వారియర్ దర్శకత్వంలో లక్స్ రాజ్ హీరోగా, సోనిరెడ్డి హీరోయిన్లుగా నిర్మించిన మెగాస్టార్ ఫ్యాన్ చిత్రం ఆడియోను ఆదివారం ఆర్కేబీచ్‌లో విడుదల చేశారు. ఆదివారం విశ్వప్రియా ఫంక్షన్ హాల్ ఎదురుగా ఆడియో ఫంక్షన్‌ను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన కంచర్ల సినీ నిర్మాత కంచర్ల అచ్యుతారావు మాట్లాడుతూ వైజాగ్‌లో చిన్న సినిమాలను తెరకెక్కించేందుకు ప్రభుత్వం ఒక స్టూడియోను నిర్మించాలన్నారు. సినిమా థియేటర్లను చిన్న సినిమాలకు కేటాయించాలన్నారు. దర్శకుడు కిరణ్ వారియర్ మాట్లాడుతూ మెగాస్టార్ చిరంజీవి సమాజానికి అందించిన సేవలను స్ఫూర్తిగా తీసుకొని ఈ చిత్రం రూపొందించామన్నారు. ఈ కార్యక్రమంలో హీరో, హీరోయిన్లు లక్స్ రాజ్, సోను రెడ్డి, నిర్మాత అల్లు శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

ఫెస్ట్.. ఫెంటాస్టిక్


బుర్రా సాయిమాధవ్‌ను సత్కరిస్తున్న నిర్వాహకులు


డ్యాన్స్ చేస్తున్న విద్యార్థులు

ఏయూక్యాంపస్: భారతీయ కళలు, పాశ్చాత్య సంగీతం అవపోసన పట్టారు. ప్రాంతీయ అనుబంధం కలిగిన సంగీతవాయిద్యాల నుంచి పాశ్చాత్య ఆంగ్ల గీతాలను సైతం అలవోకగా పాడుతూ అలరించారు. ఆంధ్రవిశ్వవిద్యాలయం వేదికగా నిర్వహిస్తున్న 37వ సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ కల్చరల్ ఫెస్ట్ యువభేరి దీనికి వేదికయ్యింది. ఆదివారం ఉదయం బీచ్‌రోడ్డులోని ఏయూ కన్వెన్షన్ సెంటర్‌లో ఉదయం ఫోక్ ఆర్కెస్ట్రా, పాశ్చత్య గీతాపాలన (సోలో), పోస్టర్ మేకింగ్ పోటీలు, మధ్యాహ్నం భారతీయ బృంద గీతాలు, కొల్లాజ్, వెస్టర్న్ ఇనుస్ట్రుమెంటల్ (సోలో), రంగోలి పోటీలను నిర్వహించారు. ఏయూ స్కూల్ ఆఫ్ ఇంటర్నేషనల్ బిజినెస్ వేదికగా వకృత్వం, డిబేట్ పోటీలను నిర్వహించారు. కార్యక్రమాలను ఏయూ అబ్జర్వర్ డాక్టర్ మనీష్ జంగ్ర పర్యవేక్షించారు. కార్యక్రమ ఏర్పాట్లు, నిర్వహణను కల్చరల్ కో ఆర్డినేటర్ ఆచార్య ఎస్.విజయ్ మోహన్ పర్యవేక్షించారు.

సినిమారంగంలో నిలిచి గెలిచే శక్తి మీకుంది

సినిమా రంగంలో నిలిచి గెలిచే శక్తి యువతకు ఉందని సినీ రచయిత బుర్ర సాయి మాధవ్ అన్నారు. ఏయూ కన్వెన్షన్ సెంటర్‌లో జరుగుతున్న యువభేరి సాంస్కృతిక పోటీల కార్యక్రమంలో ఆయన ఆదివారం సాయంత్రం పాల్గొన్నారు. ఈ సందర్భంగా యువతను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రపంచాన్ని మార్చే శక్తి కళాశాల యువత నుంచి ఆరంభం అవుతుందన్నారు. ఇక్కడ అద్భుతమైన ప్రతిభ కలిగిన యువతను తాను చూస్తున్నానన్నారు. యువతరం తమ లక్ష్యాన్ని వీడకుండా, మాతృభూమిని మరువకండా తమ ప్రయాణం కొనసాగించాలని సూచించారు.ఈ సందర్భంగా బుర్ర సాయి మాధవ్‌ను ఏఐయూ సాంకేతిక పరిశీలకుడు డాక్టర్ మనీష్ జంగ్ర సత్కరించి, జ్ఞాపిక బహూకరించారు.

త్వరితగతిన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు

కమిటీ సభ్యులతో జేసీ జూమ్ కాన్ఫరెన్స్


మాట్లాడుతున్న జేసీ విశ్వనాథన్

మహారాణిపేట: జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం సంకల్పించిన నేపథ్యంలో వీలైనంత త్వరలో ప్రక్రియను పూర్తి చేయాలని అధికారులను జిల్లా జాయింట్ కలెక్టర్ కె.ఎస్.విశ్వనాథన్ సూచించారు. జీవో నం.535లో పేర్కొన్న నిబంధనలకు అనుగుణంగా ఇళ్ల స్థలాలను కేటాయించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జర్నలిస్టుల హౌసింగ్ స్కీంపై కమిటీ సభ్యులతో జాయింట్ కలెక్టర్ ఆదివారం జూమ్ కాన్ఫరెన్స్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ పలు అంశాలపై చర్చించారు. ఈ క్రమంలో కమిటీ సభ్యులు వారి అభిప్రాయాలను వెల్లడించారు. త్వరగా ప్రక్రియను పూర్తి చేసేందుకు సమష్టి కృషి చేయాలని పేర్కొన్నారు.

వచ్చిన దరఖాస్తుల వివరాలను జర్నలిస్టుల హౌసింగ్ కమిటీ కన్వీనర్, సమాచార పౌర సంబంధాల శాఖ ఉప సంచాలకులు వి. మణిరామ్ వెల్లడించారు. ఇప్పటి వరకు మొత్తం 821 దరఖాస్తులు అందాయని, అందులో స్టేట్ హెడ్ క్వార్టర్ నుంచి 373, జిల్లాకు చెందినవి 448 ఉన్నాయని వివరించారు. ఆన్‌లైన్ పరిశీలన దశలో ఉన్న మరికొన్ని దరఖాస్తులు ఇంకా అందనున్నాయని తెలిపారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ విశాఖ నగర పరిధిలో వివిధ ప్రాంతాల్లో భూములను గుర్తించాలని, జీవోలో పేర్కొన్నట్లుగా జర్నలిస్టు వాటా 40 శాతం విలువ ఎంత ఉంటుందో తెలపాలని రెవెన్యూ అధికారులకు సూచించారు. జర్నలిస్టులు కోరుకున్న ప్రాంతాల్లో స్థలాలు మంజూరు చేసేందుకు ఆయా ప్రాంతాల్లో భూమిని గుర్తించాలని ఆర్డీవోలను ఆదేశించారు. వచ్చిన దరఖాస్తులను నియోజకవర్గాల వారీగా విభజిస్తూ వివరాలను తనకు సమర్పించాలని సమాచార పౌర సంబంధాల శాఖ డీడీకి సూచించారు. జర్నలిస్టుల 40 శాతం వాటా చెల్లింపుపై కమిటీ సభ్యులను జాయింట్ కలెక్టర్ స్పష్టత కోరగా మూడు కేటగిరీలుగా స్థలాలను విభజించాలని, వారి ఆర్థిక వెసులుబాటు మేరకు స్థలాలను అప్‌డేట్ చేసుకుంటారని కమిటీలోని జర్నలిస్టులు వారి అభిప్రాయాన్ని తెలిపారు. ఆర్డీవోలు, డీఎపీఆర్వో, జర్నలిస్టు సభ్యులు ఈ సందర్భంగా వివిధ అంశాలపై వారి సలహాలు, సూచనలు అందజేశారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి కె. మోహన్ కుమార్, రెవెన్యూ డివిజన్ అధికారులు డి. హుస్సేన్ సాహెబ్ (విశాఖ) భాస్కర రెడ్డి (భీమిలి) కమిటీ కన్వీనర్, సమాచార పౌర సంబంధాల శాఖ, ఉప సంచాలకులు వి. మణిరామ్, సభ్యులు కేజీ రాఘవేంద్రారెడ్డి, బి.రవికాంత్, పీఏ రావు, ఇ–సెక్షన్ సూపరింటెండెంట్ రామారావు పాల్గొన్నారు.

వైభవంగా దేవానంద స్వామీజీ ఆరాధన మహోత్సవం


దేవానంద స్వామీజిని దర్శించుకుంటున్న ఉప ముఖ్యమంత్రి బూడి


తరలివచ్చిన అశేష భక్తజనం

- పీఠాధిపతుల ప్రవచనాలతో పులకించిన భక్తులు
- డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు ప్రత్యేక పూజలు

దేవరాపల్లి: శ్రీ సద్గురు దేవానంద సరస్వతీ మహారాజ్ (రుషీకేష్) 24వ ఆరాధన మహోత్సవాన్ని కొత్తపెంటలోని స్వామీజీ ఆశ్రమంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ మహోత్సవానికి దేశ నలుమూలల నుంచి స్వామీజీ భక్తులు, శిష్యులు వేలాదిగా తరలి రావడంతో కొత్తపెంట గ్రామంలో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. తెల్లవారజాము నుంచి సుప్రభాతం, పతాకావిష్కరణ, నగర సంకీర్తన, భగవద్గీత పారాయణ తదితర కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

పీఠాధిపతులు, స్వామీజీల ప్రవచనాలతో పులకించిన భక్తజనం

విశాఖ జిల్లా వడ్లపూడి ఆనందాశ్రమం పీఠాధిపతి రామకృష్ణానంద ప్రవచనాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. స్వామి విష్ణుదేవానంద సరస్వతి అధ్యక్షతన జరిగిన ఆధ్యాత్మిక సభలో విజయనగరం జిల్లా గంగచోళ్లపెంట స్వామి యోగానంద భారతి, హైదరాబాద్‌కు చెందిన ఆర్య సనాతన వేద ధర్మ ప్రచారకులు మాతా జ్యోతిశ్రీ , శ్రీను సిద్ధాంతి తదితర స్వామీజీలు ఆధ్యాత్మిక ప్రవచనాలతో భక్తులు పులకించారు.

డిప్యూటీ సీఎం బూడి పూజలు

ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు దేవానంద స్వామీజీని దర్శించుకుని అత్యంత భక్తి శ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయనను సభా వేదికపై ఆశ్రమ నిర్వాహకులు, స్వామీజీలు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ దేవానంద సరస్వతీ స్వామీజీ జన్మించిన కొత్తపెంట పుణ్యభూమిలో తానూ పుట్టడం తన పూర్వజన్మ సుకృతమన్నారు. అనంతరం రామకృష్ణానంద రచించిన భీమిలి వైభవం పుస్తకాన్ని డిప్యూటీ సీఎం చేతులు మీదుగా ఆవిష్కరించారు. వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బూరె బాబురావు, కొత్తపెంట సర్పంచ్ రొంగలి వెంకటరావు, మాజీ సర్పంచ్ రొంగలి శంకరరావు తదితర ప్రజాప్రతినిధులు స్వామిజీని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా భారీ ఎత్తున అన్నసమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవానంద స్వామీజీ ఆధ్యాత్మిక జీవన సంఘం అధ్యక్షుడు కర్రి దేముడు, కోశాధికారి లెక్కల గంగునాయుడు, కార్యదర్శి పి.ఎస్.కె. నరిసంగరావు, ఉపకోశాధికారి సీహెచ్. నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.